

పోటెత్తిన భక్తులు

మంగళగిరి: పానకాల లక్ష్మీనృసింహస్వామి కొండకు భక్తులు పోటెత్తారు. కార్తిక మాసం ఆదివారం కావడంతో స్వామి దర్శనానికి వచ్చిన భక్తులతో కొండ కిటకిటలాడింది.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయన ప్రత్యేక పూజలు చేశారు.

బండ్లమ్మకు పూజలు



చందోలు (పిట్టలవానిపాలెం): చందోలులోని బగళాముఖి బండ్లమ్మ అమ్మవారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అభయ ప్రదాయినిగా అలంకరించి అభిషేకాలు చేశారు.

న్యూస్‌రీల్

అమరావతిలో భక్తుల సందడి



అమరావతి: పంచారామ క్షేత్రాలలో ప్రథమారామ క్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయం ఆదివారం తెల్లవారుజామున భక్తులతో కిటకిటలాడింది. వీరంతా తొలుత పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి ఆలయంలోని ఉసిరిక చెట్టు వద్ద దీపారాధనలతో శివ కేశవులకు పూజలు చేశారు. భక్తులు అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరీదేవికి కుంకుమార్చనలు నిర్వహించారు. పంచారామ క్షేత్రాలను సందర్శించేందుకు వచ్చిన యాత్రికులతోపాటు ఆదివారం సెలవు దినంతో కార్తిక మాసంలో మూడో ఆదివారం అయ్యినందున సుదూర ప్రాంతాల నుంచి పాఠశాలల, కళాశాలల విద్యార్థులు ధ్యానబుద్ధ ప్రాజెక్టు, పాత, కొత్త మ్యూజియంలు, అమరేశ్వరాలయం, స్నానఘాట్‌లు సందర్శించేందుకు తరలివచ్చారు. దేవాలయ కార్యనిర్వహ ణాధికారి వేమూరి గోపినాథశర్మ మాట్లాడుతూ ఆలయంలోను, గ్రామంలోని ప్రధాన వీధులలో ట్రాఫిక్ నియంత్రణకు, స్నానఘాట్‌ల వద్ద, పోలీసుశాఖ సహకారంతో భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. మూడో ఆదివారం అత్యధికంగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు తెలిపారు. సోమవారంనాడు కూడా భక్తులు అత్యధికంగా వచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన ఏర్పాట్లు చేశామన్నారు.

జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్ : బీఆర్ స్టేడియంలో ఆదివారం గుంటూరు ఫెన్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 బాల, బాలికలకు ఫెన్సింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన అసోసియేషన్ చైర్మన్ డీఎస్ క్రిస్టోఫర్ మాట్లాడుతూ ఫెన్సింగ్‌లో శిక్షణ పొందడం ద్వారా శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతాయని అన్నారు. ఈ సందర్భంగా ఫెన్సింగ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి డి. అశోక్‌బాబు, కె. సంగీత్‌బాబు పాల్గొన్నారు.

27న జెడ్పీ సర్వసభ్య సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సరసభ్య సమావేశాన్ని ఈనెల 27వ తేదీ ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో జె.మోహన్‌రావు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అధ్యక్షతన జరగనున్న సమావేశంలో భాగంగా అజెండాలో పొందుపర్చిన అంశాలపై చర్చిస్తామని, ప్రజాప్రతినిధులతో పాటు ప్రభుత్వ శాఖల అధికారులు హాజరవుతారని తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో కోచ్ దిలీప్‌కుమార్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): టీం ఇండియా క్రికెట్ ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్‌కుమార్, అండర్ 14 కోచ్ పి.వినయ్‌కుమార్ ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్నారు. దిలీప్‌కుమార్‌కు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శనానంతరం దిలీప్‌కుమార్, వినయ్‌కుమార్‌కు ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో సురేష్‌కుమార్, డూండీమోహన్, రవి, భాను, రమేష్‌బాబు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి ఇద్దరు యువకులు మృతి

నరసరావుపేటటౌన్: స్థానిక రైల్వే పోలీసుస్టేషన్ పరిధిలో ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడి ఇద్దరు యువకులు మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ తన్నీరు సుబ్బారావు ఆదివారం వెల్లడించారు. సంతమాగులూరు-శావల్యాపురం మధ్య పట్టాలపై గుర్తు తెలియని 35ఏళ్ల వయస్సున్న యువకుడు రైలు నుంచి జారిపడి మృతిచెందాడు. 20ఏళ్ల వయస్సున్న యువకుడు తన స్నేహితుడితో కలిసి విజయవాడ నుంచి అనంతపురం వరకు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తూ సాతులూరు-నరసరావుపేట మధ్య రైలుపట్టాలపై పడి మృతిచెందాడు. రెండు మృతదేహాలను స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించామన్నారు. సంబంధిత బంధువులు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

సర్వత్రా అప్రమత్తం

- జిల్లా ప్రజలకు హెచ్చరికలు జారీ చేసిన కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి
- జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూములు ఏర్పాటు
- లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- చెరువులు, కాలువలకు గండ్లు పడే అవకాశం
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు



రేపల్లె ప్రాంతంలో వరి పంటను ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు : మిచాంగ్ తుఫాన్ ప్రభావం జిల్లాపై అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ఇచ్చిన సూచనల మేరకు జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజలు, అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

కంట్రోల్ రూము ఏర్పాటు

మిచాంగ్ తుఫాన్ కారణంగా జిల్లాలో బలమైన ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున జిల్లాలోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూము ఏర్పాటు చేశారు. తుఫాన్ వలన ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే కంట్రోల్ రూము నం.0863-2234014 నంబర్‌కు ఫోన్ చేసి తక్షణ సహాయం పొందవచ్చు.

జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూం
0863-2234014
పోలీసు కంట్రోల్ రూం
8688831568

రైతులు పంటలు కాపాడుకోవాలి

తుఫాన్ ప్రభావంతో చెరువులు, కాలువలకు గండి పడే అవకాశం ఉన్నందున, చెరువులు, కాలువల గట్ల వద్ద నివాసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. సురక్షిత కేంద్రాల్లో ప్రజలకు ఇబ్బందులకు కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు



భట్టిప్రోలులో హార్వెస్టర్ ద్వారా నూర్చిన పంటను ట్రాక్టర్‌లో నింపుతున్న దృశ్యం

చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. రైతులు తమ పంటలు, ధాన్యం, పశు సంపదను సురక్షితంగా కాపాడుకునే విధంగా వారికి తగిన సహాయ సహకారాలు అందించాలన్నారు.

స్పందన రద్దు

తుఫాన్ కారణంగా సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమం కూడా రద్దు చేశారు. తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సోమవారం ఉదయం 10.30గంటలకు జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో స్పందన రద్దు చేశారు. వీడియో సమావేశానికి మండల స్థాయి అధికారులు వారి మండల హెడ్ క్వార్టర్ ద్వారా హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు.



భట్టిప్రోలు-తెనాలి రహదారి పక్కన పంట దిగుబడులను పట్టాతో కప్పిన దృశ్యం

నేడు పాఠశాలలకు సెలవు

కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు డీఈవో పి.శైలజ ఆదివారం తెలిపారు. జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈవోలు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రత్యేక పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు



కె.ఆరిఫ్‌హఫీజ్, గుంటూరు జిల్లా ఎస్పీ

నగరంపాలెం: మిచాంగ్ తుఫాన్ కారణంగా జిల్లాలోని సబ్ డివిజన్‌లు, పోలీస్‌స్టేషన్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. తుఫాన్ కారణంగా అధికార/సిబ్బంది ప్రజలకు అన్ని విధాలా సహాయక చర్యలు అందించేందుకు 24 గంటలు అందుబాటులో ఉండాలని సూచించారు. తుళ్లూరు, తెనాలి సబ్ డివిజన్ల పరిధిలోని నదీ పరివాహక గ్రామాలలో పర్యటిస్తూ, తుఫాన్ పరిస్థితులపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజ లు అప్రమత్తం చేస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లంక తీర ప్రాంతాల పోలీస్ అధికార, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ అందుబాటు లో ఉండాలని ఆదేశించారు. తుఫాన్ కారణంగా ఏమైనా అత్యవసర/విపత్కర పరిస్థితులు ఏర్పడితే డయల్- 100కు లేదా, ప్రత్యేక పోలీస్ కంట్రోల్‌రూం నంబర్ 8688831568కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. తద్వారా సహాయ చర్యలు చేపట్టేందుకు గుంటూరు జిల్లా పోలీస్ యంత్రాంగం 24 గంటలు అందుబాటులో ఉంటుందని ఎస్పీ తెలిపారు.

నేడు పోలీస్ స్పందన రద్దు

మిచాంగ్ తుఫాన్ కారణంగా సోసోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జరగాల్సిన 'జగనన్నకు చెబుదాం' (స్పందన)ను తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు గమనించాలని కోరారు.

ఆందోళనలో అన్నదాతలు

- హడావుడిగా వరి నూర్పిళ్లు
- హార్వెస్ట్ యంత్రాలకు డిమాండ్



చేబ్రోలు, మంచాల గ్రామాల మధ్య నేల వాలిన వరిపైరు

చేబ్రోలు: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి అందనున్న దశలో వాతావరణంలో వచ్చిన మార్పులు రైతులను కలవరపరుస్తున్నాయి. చేబ్రోలు మండలం చేబ్రోలు, వడ్లమూడి, వేజండ్ల, సుద్దపల్లి, శలపాడు, శేకూరు గ్రామాల్లో వరిపైరు కోతల దశకు చేరుకుంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, అధికారుల హెచ్చరికలతో పలుచోట్ల రైతులు హడావుడిగా యంత్రాలతో పనులు చేపట్టారు. చేబ్రోలు మండల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సుమారు 15వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది తెగుళ్ల బెడద తక్కువగా ఉండటంతో రైతులు సంతోషంగా ఉన్నారు. దిగుబడిపై కూడా ఆశలు పెట్టుకున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే మరో పది రోజుల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా చేపట్టనున్నారు. కొద్దిరోజులుగా వీస్తున్న గాలులకు చేబ్రోలు, మంచాల, తోట్లపాలెం తదితర గ్రామాల్లో వరి పొలాలు నేల వాలా యి. దీని వల్ల దిగుబడి తగ్గటంతోపాటు, గింజ నాణ్యత కూడా దెబ్బ తింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తుఫాన్ ప్రభావంతో రైతులు హడావుడిగా నూర్పిళ్లు చేసి ఆరబెట్టడానికి వాతావరణ సమస్య, ధాన్యాన్ని నిల్వ చేయటంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యంత్రాల సహాయంతో వరి కోతలు, ఓదెలు తిప్పటం, వరికుప్పలు వేయటం, పంట నూర్పిడి చేయటం లేకుండా ఒకేసారి ధాన్యం ఇంటికి వస్తుండటంతో ఎక్కువ మంది రైతులు యంత్రాల పట్ల ఆసక్తి చూపుతున్నారు. హార్వెస్ట్ యంత్రాలకు డిమాండ్ అధికంగా ఏర్పడింది.

నాటకానికి కొత్తదారి

- 'పరాయి'తో నాటక రంగ సంచలనం
- భారత్-పాకిస్తాన్ విభజన మిగిల్చిన వేదన ఇతివృత్తం
- నాటక కళా సేవ చేస్తున్న కెమికల్ ఇంజినీర్
- తెనాలికి చెందిన యువ రచయిత/దర్శకుడు ఉస్మాన్ ఘని



ఉస్మాన్ ఘని

తెనాలి: ఒకప్పుడు ఓ వెలుగు వెలిగి క్రమంగా ఉనికిని కోల్పోతున్న తెలుగు నాటకానికి ఇప్పుడు పరిషత్‌లే పెద్ద దిక్కన్నట్టుగా ఉంది. అలాంటి నాటకానికి ఆధునికత, అవసరమైన మార్పులు జోడించి పూర్వవైభవం కోసం కృషి చేస్తున్న అరుదైన రచయిత/దర్శకుల్లో తెనాలికి చెందిన ఉస్మాన్ ఘని ఒకరు. కెమికల్ ఇంజినీరింగ్‌లో పీజీ చేసినా, ప్రాణంగా భావించే నాటక కళను చదివాడు. థియేటర్ ఆర్ట్స్‌లో పీజీ చేశాడు. అద్భుతమైన నాటకాలను తీసుకొస్తున్నాడు. ప్రేక్షకులు టికెట్ కొనుక్కుని మరీ చూస్తున్నారు. దేశ విభజన మిగిల్చిన గాయాలతో హిందూ ముస్లింల మధ్య పేరుకుపోయిన అపనమ్మకం అనే కథను 'పరాయి' పేరుతో నాటకానికి కొత్త అర్థం చెప్పాడు. నాటకం కళాకారులను పోషిస్తుందన్న నమ్మకాన్ని కలిగించాడు. తెలుగు రాష్ట్రాల్లో సంచలన దర్శకుడిగా గుర్తింపు పొందిన ఉస్మాన్ ఘని పరిచయమిది.

ఉస్మాన్ ఘని స్వస్థలం తెనాలి దగ్గర్లోని మూల్పూరు. తండ్రి షేక్ సైదా ఇండియన్ ఆర్మీలో చేశారు. తల్లి గృహిణి. టెన్త్ తర్వాత చదువు కోసమని అమ్మమ్మ ఊరు నరసరావుపేట వెళ్లారు. చిన్నతనం నుంచీ నాటకాలంటే ఆపేక్ష. ఆంధ్రా యూనివర్శిటీలో 2016లో కెమికల్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్ చేశాక ఉద్యోగం కోసం చూడలేదు. నేరుగా హైదరాబాద్ వెళ్లాడు. నాటక సంస్థ 'భూమిక'లో చేరాడు. శిక్షణ తీసుకుని సహాయ దర్శకుడిగా, సెట్, లైటింగ్ డిజైన్ చేస్తూ నాటకంతో కొనసాగాడు. నాటకాన్ని చదవాలని పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్శిటీలో థియేటర్ ఆర్ట్స్‌లో పీజీ కోర్సులో చేరాడు. దర్శకత్వంలో స్పెషలైజ్ చేశాడు. అప్పుడే రెండు నాటకాలు తయారుచేసి, ప్రదర్శించాడు. ప్రముఖ నాటక రచయిత/దర్శకుడు ఆంటోన్ చెకాన్ రచించిన ఇంగ్లిష్ కథ 'స్వాన్ సాంగ్'ను నాటకీకరించాడు. ఏకే రామానుజన్ జానపద కథ 'ఏ సాంగ్ అండ్ స్టోరీ'ని నాటకీకరించి ఆరోవిల్లాలో ప్రదర్శించారు.. డైలాగుల్లేని నాటకమిది. మోనోలాగ్‌ను నటి/రచయిత్రి ప్రియాంక పంపండేకర్‌చే రాయించారు. కోర్సు పూర్తయ్యాక 2022 జులైలో హైదరాబాద్‌కు చేరి, బి. స్టూడియోతో అసోసియేట్ అయ్యాడు. వ్యవస్థాపకుడు షేక్ జాన్ బషీర్ కోరికపై 'పరాయి' నాటకానికి అంకురార్పణ చేశాడు.



పరాయి నాటకంలో సన్నివేశం

ఇంటర్నేషనల్ స్కూల్లో టీచర్లకూ నాటకం పాఠాలు

నవంబరు 10న హైదరాబాద్‌లో జాన్ బషీర్ దర్శకత్వంలో, ప్రముఖ రచయిత, పాత్రికేయుడు ఖదీర్‌బాబు రచన 'న్యూ బాంబే టైలర్స్'లోనూ పలు పాత్రల్లోనూ ఉస్మాన్ ఘని జీవించాడు. మరోవైపు జీవనం కోసం పాఠశాలల్లో నటశిక్షణ తరగతులు చెబుతున్నాడు. ఓ ఇంటర్నేషనల్ స్కూల్లో టీచర్లకూ నాటకం పాఠాలను బోధిస్తున్నాడు.

పరాయి ఒక సంచలనం ..



తెలుగు రాష్ట్రాల్లో పరాయి ఒక సంచలనం. ఇండియా-పాకిస్తాన్ విభజన మిగిల్చిన వేదననీ, విద్రోహపు విషాదాన్నీ, హిందూ ముస్లింల మధ్య పేరుకుపోయిన అపనమ్మకం తనను వెంటాడుతోంది. ఆ కథను కొత్తదారిలో చెప్పటానికి ఎంచుకున్న నాటకమే 'పరాయి'గా ప్రేక్షకుల ముందుకొచ్చింది. ప్రపంచ ప్రఖ్యాత ఉర్దూ కథా రచయిత సాదత్ మంటో రాసిన కథలు 'ఖోల్దో', 'సహాయ్'కు మరో సమకాలీన కథను జోడించి ఆనాటి గాయాలకు ప్రాసంగికతను తెచ్చేందుకు ప్రయత్నించాడు. దేశవిభజన ఏ సమూహాలను, ఏ మతాన్ని రాత్రికి రాత్రే దాయాదినీ, పరాయినీ చేసిందో కళ్లకు కట్టేలా రాశారు. పాటలకు బదులుగా ప్రసిద్ధ కవులు సాహిర్ లుథియాన్వీ, ఫైజ్ అహ్మద్ వంటి అయిదుగురు ప్రసిద్ధ కవుల కవితలు, షాహెర్‌లు, అనంతు చింతలపల్లి అద్భుతమైన డైలాగులతో నాటకం సిద్ధమైంది. 30 మంది నటీనటులు... అంతా 25-30 ఏళ్ల వయస్కులే. రవీంద్రభారతిలో తొలి ప్రదర్శన. రూ.250 టికెట్ కొనుక్కుని మరీ చూశారు. ఐఐటీ, హైదరాబాద్ వాళ్లు మొత్తం టికెట్లు కొనుక్కుని తమ క్యాంపస్‌లోనే ప్రదర్శనను తిలకించారు. ఇలా ఇప్పటికి మొత్తం తొమ్మిది ప్రదర్శనలతో ఉస్మాన్ ఘని ఇప్పుడో నాటకానికి కొత్త అర్థం చెప్పారు. పుస్తకంగానూ వెలువరించారు. అదే నాటకంలో తను నటించాడు కూడా.

రైతును రాజు చేసేందుకు ప్రభుత్వం కృషి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- ఎన్జీరంగా వర్సిటీలో అగ్రి టెక్ వ్యవసాయ సాంకేతిక సదస్సు ప్రారంభం
- మూడు రోజులపాటు కొనసాగనున్న సదస్సు
- శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి
- ఆకట్టుకున్న 125 వ్యవసాయ అనుబంధ స్టాల్స్



అంగ్రూబాట్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి, వీసీ విష్ణువర్ధనరెడ్డి తదితరులు



అగ్రి టెక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి

గుంటూరురూరల్: రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించి రైతును రాజు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నగర శివారు లాంఫాంలో ఉన్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ దినోత్సవం సందర్భంగా అగ్రి టెక్-2023 వ్యవసాయ సాంకేతిక సదస్సును మంత్రి ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే సదస్సులో ఏర్పాటు చేసిన వివిధ రకాల వ్యవసాయ అనుబంధ స్టాల్స్‌ను మంత్రి పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా భారతదేశంలోనే ఎక్కడ లేని వ్యవస్థని ఏర్పాటు చేసి శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు నిత్యం రైతులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యం రైతన్న అని, మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో వ్యవసాయ స్థితిగతులు బాగుపర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం, జగనన్న ఎల్లపుడూ సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. పంట పొలంలో ఉన్న రైతన్న తన సమస్యకు వెంటనే పరిష్కారం తెలుసుకునేందుకు వీలుగా ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను జగనన్న ప్రారంభించారన్నారు. దీని ద్వారా రైతును ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏవిధంగా కృషి చేస్తుందో తెలుసుకోవచ్చన్నారు. రైతన్నలకు కూలీల సమస్యలు తీర్చేందుకు డ్రోన్ టెక్నాలజీని అందించటంతోపాటు డ్రోన్ నడిపేందుకు అవసరమైన సాంకేతిక సహకారం, డీజీసీఏ ఆమోదం పొందిన డ్రోన్ పైలట్ ట్రైనింగ్‌ను అందించటంలో ఎన్జీరంగా విశ్వవిద్యాలయం దేశంలోనే ముందంజలో ఉందన్నారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మీదేవి మాట్లాడుతూ వ్యవసాయ విద్య దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం, విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించే ఈ సదస్సులో వ్యవసాయ పరమైన విషయాలను రైతులతో శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు చర్చించి చర్యలు తీసుకుంటారన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న మంత్రి గోవర్ధనరెడ్డి

చిన్న పరిశ్రమల స్థాపనకు అవకాశాలు

ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ప్రతినిధి ఎల్ శ్రీధర్, ఫుడ్ ప్రాసెసింగ్‌లో సూక్ష్మ, చిన్న పరిశ్రమలు స్థాపనకు అవకాశాలు వివరించారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ డీఎస్‌హెచ్ జీవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ నేల ఆరోగ్యం కోసం సమగ్ర యాజమాన్యం, నూతన ఎరువులు గురించి తెలిపారు. బయో ఇస్టేటిక్స్ సంస్థ ప్రతినిధి డాక్టర్ కె.ఆర్.కె రెడ్డి మాట్లాడుతూ స్థిరమైన వ్యవసాయం కోసం జీవ, పునరుత్పత్తి పద్ధతులు తెలిపారు. సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు, నూతన ఆవిష్కరణలు ఆర్‌జీ అగర్వాల్ వివరించారు. రైతులు, శాస్త్రవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులతో రైతుల సమస్యలు, ప్రశ్నలకు సమాధానాలు అందించారు. రైతులతో వారి సమస్యలపై ముఖాముఖి మాట్లాడారు. అగ్రిటెక్ ప్రదర్శనలో అనేక రకాల వ్యవసాయ ఆవిష్కరణలను ప్రదర్శించారు. అందులో వివిధ పంటల్లో నూతన వంగడాలు వాటి ఉత్పత్తి స్టాల్స్, కలుపు తీసే రోబోట్లు, ఆగ్రోమెటోరోలాజికల్ ఫోర్కాస్టింగ్ సిస్టమ్స్, పంట కోతకు ఉపయోగించే నూతన యంత్రాలు, సేంద్రియ వ్యవసాయంలో ఉత్పత్తులు, వ్యవసాయం చేసే విధానాల నమూనాలు, మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్స్, ఉత్పత్తులు, లాంఫాం పరిశోధన స్థానంలో సుమారు 15 రకాల పంట రకాలను కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, రైతులకు ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్టాల్స్ రైతులను, విద్యార్థులను ఆకట్టుకున్నాయి. పాలకమండలి సభ్యులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, అధికారులు 7వేల మందికిపైగా పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం, ఆదివారంతో ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న ఆది దంపతుల దర్శనానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. తెల్లవారుజామున ప్రారంభమైన భక్తుల రద్దీ మధ్యాహ్నం మూడు గంటల వరకు కొనసాగింది. అమ్మవారికి తెల్లవారుజామున ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీహోమం, శాంతి కల్యాణంతో పాటు నవగ్రహ హోమాల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గంతో పాటు ఘాట్‌రోడ్డు మీదగా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వ దర్శనంతోపాటు రూ.100, రూ.300, రూ.500 టికెట్లు క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం 11-40 గంటలకు అమ్మవారికి మహా నివేదన నిమిత్తం అన్ని దర్శనాలు నిలిపివేశారు. 12-20 గంటలకు తిరిగి అన్ని దర్శనాలు ప్రారంభం కావడంతో రద్దీ మరింత పెరిగింది.



దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

క్లుప్తంగా

టాక్స్ ప్రాక్టీషనర్స్ సౌత్ జోన్ అధ్యక్షుడిగా రామరాజు శ్రీనివాస్



పాత గుంటూరు: ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్‌కు దక్షిణాదిన ఉన్న ఆరు రాష్ట్రాల విభాగానికి అధ్యక్షుడిగా గుంటూరుకు చెందిన ప్రముఖ టాక్స్ ప్రాక్టీషనర్ రామరాజు శ్రీనివాస్ ఎన్నికైనారు. కేరళలోని కొచ్చిన్‌లో శనివారం జరిగిన ఫెడరేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పాండిచేరి రాష్ట్రాలకు చెందిన 30 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రామరాజు శ్రీనివాస్‌కి గుంటూరుకు చెందిన పలువురు ప్రముఖులు, ఆడిటర్లు అభినందనలు తెలిపారు. జనవరి మొదటి వారంలో గుంటూరులో ప్రమాణ స్వీకారం ఉంటుందని రామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.

యువకుడిపై హత్యాయత్నం కేసు నమోదు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద ఓ యువతిపై యువకుడు బేడ్లు లాంటి పదునైన ఆయుధంతో దాడిచేసి గాయపరిచిన సంఘటనపై పోలీసులు ఆదివారం హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వివరాలు.. విజయవాడ చిట్టినగర్‌లో నివాసముండే పోలాని కిరణ్‌కు కర్ణాటకకు చెందిన అనాథ అయిన వనపర్తి బుజ్జి పరిచయమైంది. ఆమెను విటుల వద్దకు పంపి వచ్చిన డబ్బులతో కిరణ్ జల్సాలు చేయడంతో పాటు చిత్రహింసలకు గురి చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం ఇద్దరూ గొడవపడి స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ కూడా బుజ్జిపై పదునైన ఆయుధంతో కిరణ్ దాడి చేసి పారిపోయాడు. అతనిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని, ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పొలం బావిలో మునిగి బాలుడి మృతి



యేసుబాబు(ఫైల్)

నరసరావుపేట రూరల్: పంట పొలంలోని బావిలో పడి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని జొన్నలగడ్డలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని జొన్నలగడ్డ ఎస్సీ కాలనీకి చెందిన కుందా రాంబాబు, మాధవి దంపతులకు యేసుబాబు(13), కోమలి ఇద్దరు సంతానం. మొదటి సంతానం అయిన యేసుబాబు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవురోజు కావడంతో ఇంటివద్దనే యేసుబాబు కాలకృత్యాలు తీర్చుకునేందుకు సమీపంలోని పొలంబావి వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో కాలు జారి అందులో పడి మునిగిపోయాడు. సమీపంలోని కాలనీవాసులు బావి వద్దకు వెళ్లిన సమయంలో చెప్పులు కనిపించడంతో గాలించగా యేసుబాబు మృతదేహం లభ్యమయింది.

వైకల్యం శరీరానికే .. మనసుకు కాదు

- జిల్లా జాయింట్ కలెక్టర్ జి. రాజకుమారి
- ఘనంగా అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, జేసీ రాజకుమారి తదితరులు

నెహ్రూనగర్: వైకల్యం ఏదైనా కూడా శరీరానికే కాని, మనసుకు కాదని జిల్లా జాయింట్ కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు ఏదైనా సాధించగల మనే దృఢ సంకల్పం కలిగి, అందరికీ స్ఫూర్తినిస్తున్న దివ్యాంగులకు చేయూతనిచ్చి, ఆసరాగా నిలిచి వారిని గౌరవించాలని తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా , రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్స్ సహాయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్‌తో కలసి జాయింట్ కలెక్టర్ రాజకుమారి పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో జేసీ మాట్లాడుతూ జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినట్లు చెప్పారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి పది చొప్పున రూ. 65 లక్షల విలువ చేసే 70 మూడు చక్రాల స్కూటర్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎవరైనా చిరు వ్యాపారం, ఇంటిలో ఫుడ్ ప్రొసెసింగ్ యూనిట్, టెంట్ హౌస్ గానీ ఏర్పాటు చేసుకుంటే జిల్లా యంత్రాంగం ఎంప్లాయి ష్యూరిటీ ఇప్పించి లోన్ మంజూరు చేయిస్తుందని, దీన్ని ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. విభిన్న ప్రతిభావంతుల్ని అన్ని విధాలా ఆదుకోవడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యా, వైద్యం, సంక్షేమం, ఉపాధి కల్పించేందుకు అనేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ కత్తెర క్రిస్టినా మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల్ని ఇంత చక్కగా తీర్చిదిద్దిన వారి తల్లిదండ్రులు, అవ్వా తాతలు, ట్రైనింగ్ ఇస్తున్న టీచర్లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్స్ సహాయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో విభిన్న ప్రతిభావంతులు చాలా ప్రతిభ కలిగి ఉన్నారని, ఉద్యోగాల్లో, ఆటల పోటీలలో, సేవా కార్యక్రమాల్లో కూడా రాణిస్తున్నారని తెలిపారు. జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త మాట్లాడుతూ జిల్లాలో 24,988 మందికి పెన్షన్లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. సభా కార్యక్రమం అనంతరం దివ్యాంగ బాలబాలికల పోటీల్ని జెండా ఊపి ప్రారంభించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం డిసెంబర్ 3 , దివ్యాంగుల హక్కుల చట్టం 2016పై రూపొందించిన పోస్టర్లను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో డెప్యూటీ కలెక్టర్ కె. స్వాతి , సమగ్ర శిక్ష ఏపీడీ విజయలక్ష్మి, నగరపాలక సంస్థ డెప్యూటీ మేయర్ సజీల, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పరమేశ్వరరెడ్డి , విభిన్న ప్రతిభావంతుల సంఘాల జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఫిషరీస్ ఏడీ సైదా నాయక్



పెనుమూడిలో ఆక్వా రైతులకు సూచనలిస్తున్న ఫిషరీస్ ఏడీ సైదా నాయక్

రేపల్లె రూరల్: మిచాంగ్ తుపాను నేపథ్యంలో తీరంలోని ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలని ఫిషరీస్ ఏడీ సైదానాయక్ సూచించారు. తుపాను సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండలంలోని పెనుమూడిలో ఆదివారం ఆక్వా రైతులకు వివరించారు. తుపానువచ్చే సమయంలో చేపలు, రొయ్యలు పట్టుబడి చేయరాదన్నారు. సాగు చేసే చెరువులో మేతలు వేయటం తగ్గించాలని కోరారు. ఎటువంటి ఎరువులు, రసాయన మందులు చెరువులలో చల్లరాదన్నారు. విద్యుత్ కోతలు ఉండేందుకు అవకాశం ఉన్నందున డీజిల్ ఆయిల్ సరిపడా సిద్ధం చేసుకోవాలని సూచించారు. కొత్తగా రొయ్య పిల్లలు, చేప పిల్లలు వదలటం, బదిలీ చేయటం చేయరాదని చెప్పారు. బలహీనంగా ఉన్న చెరువు గట్లను ఇసుక బస్తాలతో పటిష్ట పరచుకోవాలని కోరారు. అధిక వర్షపాతానికి చెరువులు పొంగే అవకాశం ఉన్నందున కొంత నీటిని ముందుగానే బయటకు పంపించాలని వివరించారు. చెరువు గట్లపై ఉండే వృద్ధులు, మహిళలు, పిల్లలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. మబ్బులు, వర్షం కారణంగా ప్రాణ వాయువు స్థాయి తగ్గే అవకాశం ఉన్నందున పొటాషియం పర్మాంగనేట్‌గాని, కాల్షియం పెరాక్సైడ్‌గాని, ఆక్సిజన్ బిళ్లలను సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. సాగులో ఉన్న చెరువు గట్లు తక్కువ ఎత్తు ఉంటే ఆ చెరువు చుట్టూ వలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సాగులో చేపలు చనిపోతే గోతులో సున్నం వేసి కప్పిపెట్టాలన్నారు. రొయ్యల చెరువులో వర్షం తగ్గిన వెంటనే చెరువులలోని వర్షపు నీటిని బయటకు పంపించాలన్నారు. చెరువు గట్లు మీద విద్యుత్ ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

వరి సాగుపై అవగాహన అవసరం

ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణవేణి



రైతులకు వరిసాగుపై మెలకువలు అందిస్తున్న కృష్ణవేణి

బాపట్ల: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం స్థాపించి 60 ఏళ్లు పూర్తి చేసుకుని డైమండ్ జూబ్లీ వేడుకలు సందర్భంగా మండలంలోని జమ్ములపాలెం, కంకటపాలెం, నరసాయపాలెం, అప్పికట్ల ప్రాంత రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 2023లో విడుదలైన బీపీటీ 2876, బీపీటీ 2841 వంగడాలు గురించి రైతులకు వివరించారు. ఉప్పునీటి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.ప్రసూనాదేవి ఆధ్వర్యంలో ఉప్పునేల, చౌడు భూములు పునరుద్ధరణ పద్ధతులు, మట్టి నమూనా సేకరణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.సాంబశివరావు, డాక్టరు మృదుల, సిబ్బంది పాల్గొన్నారు.

బైకును ఢీకొట్టిన కారు

- ఘటనలో గాయపడిన భార్య, భర్త, ఇద్దరు పిల్లలు
- మహిళ పరిస్థితి విషమం

శావల్యాపురం: ప్రార్థన మందిరానికి బయలు దేరిన కుటుంబ సభ్యులు రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కనమర్లపూడి గ్రామసమీపాన జాతీయ రహదారి మార్గంలో పెదకంచర్ల వంతెన వద్ద ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలు మేరకు విశాఖపట్టణం నుంచి శ్రీశైలంకు నలుగురు అయ్యప్ప మాలధారణ భక్తులు ఏపీ 39యూటీ1997 నంబరు కారులో బయలు దేరారు. అదేక్రమంలో మండలంలోని బొందిలిపాలెం గ్రామం ఎస్సీ కాలనీకు చెందిన సుంకర ఎర్రయ్య, భార్య ఆదిలక్ష్మి (బుజ్జి) వారి పిల్లలు అభి, చక్రి నలుగురు కలిసి వినుకొండ వైపునకు చర్చికి ప్రార్థనకు బైకుపై వెళుతుండగా ఒక్కసారిగా కారు అతి వేగంతో బైకును ఢీకొట్టింది. దీంతో కొన్ని అడుగుల ఎత్తులో లేచి ఒక్కసారిగా రోడ్డుపై ఎర్రయ్య, తన పిల్లలు పడిపోగా పక్కనే ఉన్న కాల్వలో ఆదిలక్ష్మి పడిపోయింది. గమనించిన స్థానికులు క్షతగాత్రులకు సహాయ చర్యలు చేపట్టి అనంతరం 108 అత్యవసర వాహనికి ఫోన్ చేసి సమాచారం అందించగా నిమిషాల వ్యవధిలో సంఘటన స్థలానికి చేరుకొన్న అంబులెన్స్ వారికి ప్రాథమిక చికిత్స అనంతరం వినుకొండలోని ఒక ప్రైవేటు వైద్యశాలకు తరలించింది. రోడ్డు ప్రమాదంలో ఇరువురు చిన్నారులకు స్వల్ప గాయాలు కాగా, ఎర్రయ్య కంటి భాగంలో తీవ్ర గాయమైంది. ఆదిలక్ష్మికి కుడి చేయి విరిగిపోగా, పైనుంచి పడపోవటంతో కుప్పకూలిపోయింది. ఆదిలక్ష్మి పరిస్థితి విషమంగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

అర్హులైన ప్రతి వ్యక్తికీ ఓటుహక్కు

బీఎల్‌వోలకు సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదేశం



కఠెవరంలోని పోలింగ్ కేంద్రంలో తనిఖీ చేస్తున్న గీతాంజలి శర్మ

తెనాలి: ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని, అర్హులైన ప్రతి వ్యక్తికి ఓటు హక్కు కల్పించాలని తెనాలి సబ్‌కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలి శర్మ ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా గత రెండురోజులుగా తెనాలి నియోజకవర్గంలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌వో) సంబంధిత ఓటరు జాబితాతో సహా అందుబాటులో ఉన్నారు. ఓవరు ఎవరైనా తమ ఓటు జాబితాలో ఉందా? లేదా? అనేది పరిశీలించుకునేలా ఈ అవకాశాన్ని కల్పించారు. బీఎల్‌వోలు అందుబాటులో ఉన్నదీ? లేనిదీ పరిశీలించి, ప్రచార కార్యక్రమం సజావుగా జరిగేందుకు సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల్ని సందర్శించారు. ప్రజలు వచ్చి ఓటరు జాబితాలో తమ పేరును చూసుకుంటున్నారా? లేదా? పరిశీలించారు. చనిపోయినవారి పేర్లు, డూప్లికేట్ పేర్లు జాబితాలో ఉంటే వాటిని తొలగించాలని, అందుకు తగిన ప్రక్రియను చేపట్టాలని ఆదేశించారు. ఆదివారం ఓటు నమోదు కోసం ఫారం-6 అర్జీలు 213, ఫారం-7 అర్జీలు 139, ఫారం-8 అర్జీలు 189 వచ్చాయి. గత రెండురోజుల్లో ఫారం-6 అర్జీలు 514, ఫారం-6ఏ అర్జీలు-01 , ఫారం-7 అర్జీలు 360, ఫారం-8 దరఖాస్తులు 369 వచ్చాయి. వీరితోపాటు సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అయిన మండల తహశీల్దార్ కె.రవిబాబు, సూపర్‌వైజర్లు పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ప్రచారాన్ని పర్యవేక్షించారు.

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం



ట్రైసైకిళ్లు అందుకున్న దివ్యాంగులతో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

ట్రైసైకిళ్లు పంపిణీ చేసిన బజరంగ్ ఫౌండేషన్

కొరిటెపాడు: జగనన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా పొన్నూరు నియోజకవర్గంలోని తొమ్మిది మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేసినట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. పొన్నూరు మండలం ములుకుదురులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఈ ట్రైసైకిళ్లు పంపిణీ చేసినట్లు వివరించారు. ఒకరికి జైపూర్ కాలును కూడా తయారు చేయించి అందించామని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో దివ్యాంగుల కోసం దివ్యాంగదర్శిని పేరిట ఈ కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. అవసరమైన దివ్యాంగులకు జైపూర్ కాళ్లు, చేతులు తయారు చేయించి వారి ఇళ్ల వద్దకు వెళ్లి అందిస్తున్నట్లు తెలిపారు.

జేఎన్‌టీయూకే సెంట్రల్‌జోన్ ఖోఖో పోటీలు ప్రారంభం

పాల్గొంటున్న 28 పురుషులు, 18 మహిళల జట్లు



బాలుర విభాగంలో తలపడుతున్న క్రీడాకారులు

నరసరావుపేట రూరల్: క్రీడల ద్వారా ఆలోచన శక్తి పెరగడంతో పాటు మానసిక ఒత్తిడిని జయించవచ్చని జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ అంతర కళాశాలల పురుషుల, మహిళల ఖోఖో పోటీలు ఆదివారం నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో ప్రారంభమయ్యాయి. పోటీల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జేఎన్‌టీయూఎన్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, జేఎన్‌టీయూకే స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్, జేఎన్‌టీయూఎన్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జీపీ రాజులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చూపే క్రీడాకారులకు ప్రభుత్వాలు ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయని తెలిపారు. డాక్టర్ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ జేఎన్‌టీ అకడమిక్స్‌లోనే కాకుండా క్రీడల్లోను ప్రతిభ కనబర్చి అవార్డులు సాధిస్తుందని తెలిపారు. ఈ ఏడాది యూనివర్సిటీ క్యాంపస్‌లో రూ.9.5కోట్లతో సింథటిక్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ జీపీ రాజు మాట్లాడుతూ వర్సిటీ పరిధిలో ఈ అకడమిక్ ఇయర్‌లో నాలుగు ఈవెంట్‌లు నిర్వహించినట్లు తెలిపారు. పోటీలలో పురుషుల విభాగం నుంచి 28 జట్లు, మహిళల విభాగం నుంచి 18 జట్లు పాల్గొంటున్నాయి. 750మంది క్రీడాకారులు, 80 మంది ఫిజికల్ డైరెక్టర్లు హాజరయ్యారు. పోటీల అనంతరం సెంట్రల్ జోన్ పురుషుల, మహిళల జట్లను ఎంపికచేస్తారు. కళాశాల కార్యదర్శి, పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్ బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసకుమార్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు ఎల్.కృష్ణారెడ్డి, ఝాన్సీరాణి, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మన ధర్మాన్ని ఆచరించి, కాపాడాలి

- ప్రణవానంద భారతి స్వామి
- భట్టిప్రోలులో హిందూ సమ్మేళన సభ



శోభా యాత్రలో పాల్గొన్న ఎస్ఎస్ఎఫ్ నిర్వాహకులు, సభ్యులు

భట్టిప్రోలు: మన ధర్మాన్ని ఆచరించి కాపాడాలని శ్రీ సత్యజ్ఞాన ఆశ్రమం నిర్వాహకులు ప్రణవానంద భారతి స్వామి అన్నారు. సమరసతా ఫౌండేషన్(ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం భట్టిప్రోలు వేణుగోపాలస్వామి దేవాలయ ఆవరణలోని సాయికృష్ణ కళావేదిక ఆవరణలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మం విశ్వజనీయమై, ప్రపంచ శాంతిని కోరుకుంటుందని చెప్పారు. ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రముఖ్ కొండారెడ్డి మాట్లాడుతూ ఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార వాడల్లో టీటీడీ ఆర్థిక సహాయంతో 820 దేవాలయాలు నిర్మించి, 14 పర్యాయాలు రాష్ట్రంలో ఇంటింటా ధర్మ ప్రచారాలు, సమ్మేళనాలు, శోభాయాత్రలు నిర్వహించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా భజన సంకీర్తనలు, శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి మండల కన్వీనర్ వేల్పూరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో బి.విజయలక్ష్మి, వై.శివనాగమల్లేశ్వరి, బి.అరుణకుమారి, కె.రవికుమార్, పి.వెంకటేశ్వరరావు, వి.వెంకటేశ్వరరావు, వి.శివగోపి, పి.కోటేశ్వరరావు, కొంతి బాబూరావు, బి.శ్రీనివాసరావు, హేమశంకరరావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

జగనన్న సీఎంగా మరోసారి చరిత్ర సృష్టిస్తారు

ఎమ్మెల్సీ రఘురాజు



ఎమ్మెల్సీ రఘురాజుతో పాదయాత్ర చేస్తున్న నాయకులు

మార్టూరు: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రజాతీర్పుతో రెండోసారి గెలిచి చరిత్ర సృష్టించనున్నారని ఎమ్మెల్సీ హిందుపురి రఘురాజు పేర్కొన్నారు. 'జయహో జగనన్న- చలో తిరుమల' పేరుతో చేపట్టిన పాదయాత్ర బృందం ఆదివారం ఉదయం మార్టూరు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావాలని విజయనగరం జిల్లా బొడ్డవల నుంచి తిరుమలకు 820 కిలోమీటర్లు పాదయాత్రగా బయలుదేరి 43 రోజుల అనంతరం మార్టూరు చేరినట్లు వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలే మరోసారి పార్టీని గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం బొల్లాపల్లి టోల్‌ప్లాజా వరకు దర్శి, కోనంకి గ్రామాల మీదుగా పాదయాత్రగా బయలుదేరి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పఠాన్ కాలేషావలి, పార్టీ నాయకులు బాబూనాయక్, రాజా నాయక్, సుకుందరావు, రవిచంద్, గడ్డం మస్తాన్‌వలి, సులేమాన్, మైలా చిననాగేశ్వరరావు, జానీ బాషా, వినుకొండ సుధాకర్ పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలి



ఎన్‌టీఎఫ్ నూతన కార్యవర్గం ఎంపిక

బాపట్ల: గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కుంభ ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. బాపట్లలోని ఎన్జీఓ హోమ్‌లో జిల్లా గిరిజన ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్రంలో 33 లక్షలకుపైగా ఉన్న గిరిజనులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. గిరిజనులకు నివేశన స్థలాలు ఇవ్వాలని కోరారు. హాస్టల్‌లో చదువుకుంటున్న గిరిజనుల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

నూతన కమిటీ ఎంపిక

జిల్లా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా దేవరకొండ రాము, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉయ్యాల శివ, సెక్రటరీగా కట్ట పెద్దన్న, కోశాధికారిగా అంగడి వెంకటేశ్వర్లు, సంయుక్త సెక్రటరీగా ఉయ్యాల గురవయ్య, సలహాదారులు బొజ్జగాని రవికుమార్, దేవర ప్రసాద్, కట్టా కామేశ్వరి, వల్లెపు పూర్ణ, పాలపర్తి నాగరాజును ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఒకరికి తీవ్రగాయాలు



మూకిరి దినేష్

నకరికల్లు: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందగా, మరొకరు గాయపడ్డారు. ఈ సంఘటన నరసరావుపేటరోడ్డులో మండలంలోని దేచవరం మిద్దె సమీపంలో ఆదివారం జరిగింది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చల్లగుండ్ల గ్రామానికి చెందిన మూకిరి దినేష్ (19) తనకు వరుసకు చిన్నమ్మ అయిన మేడా మేఘనతో కలసి ద్విచక్ర వాహనంపై నరసరావుపేటకు బయలుదేరారు. మార్గంమధ్యలో దేచవరం మిద్దె వద్ద నరసరావుపేట నుంచి పిడుగురాళ్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. దీంతో దినేష్ అక్కడికక్కడే మృతిచెందగా, మేఘనకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు 108 సహాయంతో తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మేఘనకు నవోదయ ఎంట్రన్స్ పరీక్ష రాయించేందుకు తీసుకెళ్తుండగా ఘటన చోటుచేసుకుంది. మృతదేహం వద్ద మృతుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎ.బాలకృష్ణ తెలిపారు.

భవానీ ద్వీపంలో కార్తిక సందడి



ద్వీపంలో భోజనాలు చేస్తున్న సందర్శకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఆధ్వర్యంలో భవానీ ద్వీపం పర్యాటకులతో కళకళలాడింది. సహజంగానే శని, ఆదివారాలు, సెలవు దినాల్లో పర్యాటకులు అధిక సంఖ్యలో భవానీ ద్వీపానికి వెళ్లి ఉత్సాహంగా..ఉల్లాసంగా గడుపుతుంటారు. ఇక కార్తిక మాసం వచ్చిందంటే చాలు పిల్లలు, యువత, మహిళలకు భవానీ ద్వీపం గుర్తుకు రాక మానదు. ఎంచక్కా ఉదయం వెళ్లి సాయంత్రం వరకు కృష్ణానదీ తీరాన ప్రకృతి ఒడిలో మైమరిచిపోతారు. పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఏపీటీడీసీ ఆదివారం భవానీ ద్వీపంలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఉదయం నుంచి నగరవాసులతోపాటు పరిసర ప్రాంతవాసులు కూడా బృందాలుగా వచ్చి బరంపార్క్ నుంచి బోటులో ప్రయాణించి ద్వీపానికి చేరుకున్నారు. అక్కడికి వెళ్లగానే ఎక్కడ లేని ఉత్సాహం వారిలో పెల్లుబికింది. వివిధ సందర్శన ప్రదేశాల్లో సెల్ఫీల సందడి నెలకొంది. వనసమారాధనకు వచ్చినవారి కోసం ఏపీటీడీసీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రముఖ కళాకారుడు సిల్వెస్టర్ మిమిక్రీతోపాటుగా టాకింగ్ డాల్‌తో సందర్శకుల మోములో నవ్వులు పూయించారు.